క్లుప్తంగా

మహిళా సాధికారతకు కృషి

రాజమహేంద్రవరం రూరల్: మహిళా సాధికారిత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. హుకుంపేటలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా మహిళా నాయకత్వం తీసుకురావడం జరిగిందన్నారు. మహిళలు చట్ట సభల్లోకి రావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నారీ శక్తి అభినయం చట్టంతో అసెంబ్లీ, పార్లమెంటులో సైతం 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయం చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని వినియోగించుకుంటూ మహిళలు ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయాలన్నారు. మహిళలందరికీ జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభం

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల మహిళా వసతి భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన శిశు సంరక్షణ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా జడ్జి గంధం సునీత ప్రారంభించారు. ప్రిన్సిపాల రామచంద్ర ఆర్కే సంకల్పంతో సమన్వయకర్త, ఆంగ్ల అధ్యాపకురాలు డాక్టర్ బి.భవాని నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.అనూష, డాక్టర్ బి.సుబ్బలక్ష్మి, షేక్ జరీనా, డాక్టర్ వీడి ప్రవీణ, డాక్టర్ ఐ.రాజేశ్వరి, డాక్టర్ ఎస్.సుజాత తదితరులు పాల్గొన్నారు.

రేపు ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ



హోమాలు, పూజలు నిర్వహిస్తున్న పండితులు

కడియం: దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఉదయం 10.54 గంటలకు జరగనుంది. తోకల వారి వంశస్తుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య మహోత్సవం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం నుంచే ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవల్లి రాధాకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో వేద పండితులు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠ అనంతరం మహా అన్నసమారాధన నిర్వహించనున్నారు.

వీనుల విందుగా వీణావాదం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): త్యాగరాజ నారాయణదాస సేవా సమితి ఆధ్వర్యంలో 74వ సంగీత వార్షికోత్సవాలలో రెండవరోజు శుక్రవారం సాయంత్రం వీణావాద్యరత్న ద్విభాష్యం నగేష్ బాబు వీణావాదం వీనుల విందుగా సాగింది. మృదంగ రత్నాకర కమలాకర యోగీష్, ఘట వాద్యరత్న సరస్వతుల హనుమంతరావు ఘటంతో సహకరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణ వర్గ సమితి గౌరవాధ్యక్షులు వాడ్రేవు వెంకటరమణ, చైర్మన్ చింతలూరి సుందర వెంకటరావు, వైస్ చైర్మన్లు జూపూడి వెంకట రమణారావు, ముత్తంగి బుచ్చిరామయ్య, ప్రిన్సిపల్ కార్యదర్శి జోస్యుల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కేసు

కంబాలచెరువు: పెళ్లి చేసుకోవాలంటూ యువతిని వేధిస్తున్న యువకుడిపై ఒకటో పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. అన్నపూర్ణమ్మ పేటకు చెందిన పూజ అదే ప్రాంతానికి చెందిన సయవుల్లా ప్రేమించుకున్నారు. అయితే కొంతకాలంగా సయవుల్లాకు పూజ దూరంగా ఉంటోంది. తనను పెళ్లిచేసుకోవాలని ఆమెను సయవుల్లా పలుమార్లు అడిగాడు. గంజాయి, ఇతర అలవాట్లకు బానిసైన అతడిని పూజ తిరస్కరించింది. దీంతో వేధించడం ప్రారంభించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జనఔషధి కేంద్రాలలో 2,034 రకాల మందులు



మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం రూరల్: జనఔషధి కేంద్రాలలో 2,034 రకాలు మందులు అందుబాటులో ఉన్నాయని ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. హుకుంపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం వద్ద శుక్రవారం జాతీయ 7వ జన ఔషధి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ నాణ్యమైన మందులను తక్కువ ధరలకు జన ఔషధి కేంద్రాల్లో దొరుకుతాయన్నారు. దేశంలో ఇప్పటి వరకూ 15 వేల కేంద్రాలు ఉండగా, రాబోయే రెండేళ్లలో 25 వేలకు పెంచుతారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డ్రగ్స్ కంట్రోలు అసిస్టెంటు డైరెక్టర్ డి.నాగమణి మాట్లాడుతూ జనరిక్ మందులు బ్రాండెడ్ మందులు పనితీరు సమానమేనన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా కో ఆపరేటివ్ అధికారి జగన్నాథరెడ్డి, డీసీసీబీ ఏజీఎం వై.రమేష్, డీసీసీబీ మేనేజర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా రక్షకులు

- మహిళల రక్షణకు పోలీసు శాఖ ప్రాధాన్యం
- చట్టాలపై అవగాహన సదస్సులు
- జిల్లా కార్యాలయంలో ఓపెన్ హౌస్
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు



ఓపెన్ హౌస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కంబాలచెరువు: కుటుంబ సంక్షేమానికి, సమాజాభ్యున్నతికి మహిళల పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. వారి ఉన్నతితోనే కుటుంబం ముందుకు సాగుతుంది. ఈ నేపథ్యంలో మహిళలు అన్నింటా ముందుండాలి, అన్ని విషయాలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో పోలీసు శాఖ ఓపెన్ హౌస్ కార్యక్రమాలకు నాంది పలికింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో కొద్ది రోజులుగా జరుగుతోంది. ఈ నెల ఒకటిన ప్రారంభమైన ఈ కార్యక్రమం శనివారంతో ముగుస్తుంది. ఇప్పటి వరకూ సుమారు 2 వేల మందికి పైగా విద్యార్థినులు ఓపెన్ హౌస్‌ను సందర్శించారు.

పోలీసు ఆయుధాలపై అవగాహన

పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, స్టేషన్‌లో విధి విధానాలు తదితర వాటిపై ఓపెన్ హౌస్‌లో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు. పోలీసు కార్యాలయంలో ఉండే రిసెప్షన్ సెంటర్ నుంచి కమ్యూనికేషన్ వీహెచ్ఎఫ్ సెట్, పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, ఎల్‌హెచ్ఎంఎస్, బాడీ వార్న్ కెమెరాలు, డ్రోన్లు, డాగ్ స్క్వాడ్, సోషల్ మీడియా అండ్ సైబర్ క్రైమ్ అవేర్నెస్ వీడియోలు, క్లూస్ టీం పరికరాల పనితీరును క్షుణ్ణంగా వివరిస్తున్నారు.

మహిళా చట్టాలపై..

మహిళలకు రక్షణగా ఉన్న చట్టాలను తెలియజేసి, వాటిపై అవగాహన పెంచి, మనోధైర్యం కల్పించే దిశగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నగరంలోని అన్ని విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు జరుగుతున్నారు. మహిళా చట్టాలు, పోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు, సైబర్ క్రైం తదితర వాటిని వివరించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నారు. ఆకతాయిల బెదిరింపుల సమయంలో తీసుకోవాల్సిన స్వీయ రక్షణ మెళకువలను తెలియజేస్తున్నారు.

అత్యవసర నంబర్లు

మహిళా రక్షక్ వాట్సప్ నంబర్	94932 06006
చైల్డ్ హెల్ప్ లైన్	1098
వుమెన్ హెల్ప్ లైన్	181
పోలీస్ హెల్ప్ లైన్	112
సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్	1930

మహిళలకు ప్రాధాన్యం



మహిళల రక్షణకు పోలీసు శాఖ అధిక ప్రాధాన్యమిస్తోంది. వారికి ఎల్లవేళలా పోలీసు సిబ్బంది సహాయ, సహకారాలు ఉంటాయి. అత్యవసర సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వడానికి, పోలీస్ స్టేషన్‌ను సంప్రదించడానికి సంకోచించకండి. అత్యవసర సమయంలో పోలీసు శాఖ అందుబాటులో ఉంచిన నంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే సహాయం అందించేందుకు వీలవుతుంది. ఓపెన్ హౌస్ ద్వారా విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– డి.నరసింహ కిశోర్, జిల్లా ఎస్పీ

డీపీఎంవో అభిషేక్ సేవలు అభినందనీయం



అభిషేక్ రెడ్డిని సత్కరిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్‌గా డాక్టర్ సీహెచ్ రాజా అభిషేక్ రెడ్డి అందించిన సేవలు అభినందనీయమని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన పీజీ చదివేందుకు వెళుతున్న నేపథ్యంలో శుక్రవారం ఆయనను డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నూతన జిల్లా ఏర్పడిన తరువాత జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుతో పాటు విధి నిర్వహణలో అంకిత భావంతో అభిషేక్ పనిచేశారన్నారు. అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎన్.వసుంధర, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జె.సంధ్య, డాక్టర్ కె.సుధాకర్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యప్రభ, కంటి వెలుగు డీపీఎం డాక్టర్ లావణ్య, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.విజయకుమారి, ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్‌వీ నరసమ్మ పాల్గొన్నారు. డాక్టర్ అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతోనే డీపీఎంవోగా సమర్థవంగా విధులు నిర్వహించగలిగానన్నారు. అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజార్ల ఎస్టేట్ అధికారుల బదిలీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం నగరంలోని ఎనిమిది రైతు బజార్ల ఎస్టేట్ అధికారులను బదిలీ చేస్తూ మార్కెటింగ్ శాఖ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. భాస్కరరావును నటరాజ్ థియేటర్ రైతుబజార్‌కు, ఎస్.శ్రీనివాసరావును ఆర్ట్స్ కళాశాల రైతు బజార్‌కు, సీహెచ్ సత్యనారాయణను గణేష్ చౌక్ రైతుబజార్‌కు, కె.వెంకటేశ్వరరావును మార్కెట్ యార్డు రైతుబజార్‌కు, కె.శ్రీనివాస్‌ను ఆల్కాట్‌తోట రైతుబజార్‌కు, ఐటీవీ అప్పాజీరావు (తేజ)ను శంభూనగర్ రైతుబజార్‌కు, ఎస్.రోజాను క్వారీ మార్కెట్ రైతు బజార్‌కు బదిలీచేశారు. లాలా చెరువు రైతుబజార్ ఎస్టేట్ అధికారికి రెండేళ్లు పూర్తికాకపోవడంతో బదిలీ చేయలేదు.

యంత్రాలను సక్రమంగా వినియోగించుకోవాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ డంపింగ్ యార్డులోని తడి, పొడి చెత్తలను ప్రోసెస్ చేసే యంత్రాలను సక్రమంగా వినియోగించుకోవాలని పారిశుధ్య విభాగం అధికారులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఆయన శుక్రవారం నగరపాలక సంస్థ డంపింగ్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వ్యర్థాల నిర్వహణ ప్రధాన అంశమన్నారు. చెత్తను తొలగించి, వేరు చేసే యంత్రాల వినియోగం సక్రమంగా ఉండాలన్నారు. అనంతరం అశోక థియేటర్ సమీపంలోని దిశ పోలీస్ స్టేషన్ నుంచి ముగ్గుపేట వరకు జరుగుతున్న బీటీ రోడ్డు పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో శనివారం జరిగే మహిళా దినోత్సవం ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఆయన వెంట మున్సిపల్ ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎ.వినూత్న, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు మాధవి, మదర్షా అలీ, రీటా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు



ప్రసన్న కుమార్ దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావంతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రాజమండ్రి డివిజనల్ స్టేట్ టాక్స్ డిపార్ట్‌మెంట్ జాయింట్ కమిషనర్ కె.నీరజ అన్నారు. కోస్తాంధ్ర నుంచి మొదటిసారిగా ద ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన చార్టెడ్ అకౌంటెంట్ డి.ప్రసన్న కుమార్‌కు నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జాయింట్ కమిషనర్ నీరజ మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ప్రసన్న కుమార్ చాటర్డ్ అకౌంటెంట్‌గా స్థిరపడి, ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాకు ఎన్నికవ్వడం మనందరికీ ఎంతో గర్వకారణమన్నారు. సెంట్రల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఎం.విజయకృష్ణ మాట్లాడుతూ సీఏ చదవాలనుకునే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అనేక మార్పులు తీసుకువచ్చిన ప్రసన్నకుమార్‌ను సన్మానించుకోవడం ఎంతో ఆనందాయకమన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ఎస్ఐఆర్‌సీ వైస్ చైర్మన్ సీఏ ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ తెలుగుతేజం ఢిల్లీ స్థాయిలో వైస్‌చైర్మన్‌గా ఎన్నికావడంపై అభినందనలు తెలిపారు. అనంతరం ద ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా రాజమహేంద్రవరం బ్రాంచి(ఎస్ఐఆర్‌సీ) నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. చైర్మన్ కేకే వెంకటేశ్వర్లు, ఏఎల్ నరసింహారావు, సెక్రటరీ బీసీహెచ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకే నేర చరిత్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ నాయకులే అసలైన నేర చరిత్ర ఉన్నవారని వైఎస్సార్ సీపీ నాయకుడు పులి సాగర్ ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ 45, 46 డివిజన్లలో ఉన్న నాయకులందరూ నేర చరిత్ర కలిగిన వారేనని ఆరోపించారు. నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని టీడీపీ పెంచి, ప్రోత్సహిస్తోందన్నారు. పైగా వైఎస్సార్ సీపీపై బురద జల్లాలని ప్రయత్నించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యపు పనులతో గోరక్షణ పేటలో ఒక యువకుడు రోడ్డు నిర్మాణం వద్ద సరైన సూచికలు పెట్టకపోవడంతో ప్రమాదం జరిగి మృతి చెందాడన్నారు. ఇటీవల గోదావరిలో జరిగిన పడవ ప్రమాదం జరిగిన ఇద్దరు మృత్యువాత పడ్డారన్నారు. వీటన్నింటికి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్నారు. టీడీపీ నాయకులు ఆదిరెడ్డి భజన బృందంగా పనిచేస్తున్నారని విమర్శించారు.

మహిళా చట్టాలు అమలయ్యేలా చర్యలు

- జిల్లా న్యాయమూర్తి సునీత
- పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్ ప్రశాంతి తదితరులు
- ఘనంగా మహిళా దినోత్సవం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత, కలెక్టర్ ప్రశాంతి తదితరులు



ఎస్‌కేఆర్ కళాశాలలో మహిళలను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ రాఘవ కుమారి



సిమెంటరీపేట పాఠశాలలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న డీఐ దిలీప్ కుమార్, మహిళలు



ర్యాలీలో పాల్గొన్న జిల్లా అధికారులు



మహిళలను సత్కరిస్తున్న ప్రముఖులు



ఆర్ట్స్ కళాశాలలో మహిళా దినోత్సవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహిళా చట్టాలు నూరుశాతం అమలు పరిచేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక సరస్వతీ ఘాట్ వద్ద శుక్రవారం సాయంత్రం హెల్ప్ లైన్ నంబర్లు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించే పోస్టర్లను కలెక్టర్ ప్రశాంతితో కలిసి ఆమె ఆవిష్కరించారు. ముందుగా జయహో మహిళ అంటూ పింక్ బెలూన్లను గాల్లోకి వదిలారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ మహిళల చట్టాలపై న్యాయ, రెవెన్యూ, పోలీస్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ , మీడియా సహకారంతో మహిళలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం జిల్లా స్థాయిలో వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. సీనియర్ సివిల్ జడ్జి నాగిడి శ్రీలక్ష్మి, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, జిల్లా మహిళ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.విజయ కుమారి, సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్, ఇన్‌స్పెక్టర్ మంగాదేవి, సీడీపీవో నరసమ్మ పాల్గొన్నారు.

సిమెటరీపేట పాఠశాలలో..

కంబాలచెరువు: స్థానిక సిమెంటరీపేట ప్రాథమిక పాఠశాలలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని, వారిని ప్రోత్సహిస్తే మరిన్ని విజయాలు సాధిస్తారన్నారు.. మ్యాజిక్ బస్ టీఎంఓ జి.ప్రియాంక, హెచ్ఎం స్వర్ణలత పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో..

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో కళాశాల అధిపతి డాక్టర్ రామచంద్ర ఆర్కే ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఈస్ట్ జోన్ డీఎస్పీ విద్య, గంగా హాస్పిటల్స్ గైనకాలజిస్ట్ డాక్టర్ స్పందన, డీఎల్ఎస్ఏ సెక్రటరీ శ్రీలక్ష్మి హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో వివిధ రకాల విభాగాధిపతులకు, అతిథులకు, అధ్యాపక అధ్యాపకేతర మహిళా సిబ్బందికి మహిళా శిరోమణి పురస్కారాలు అందజేశారు.

అన్ని రంగాలలో ముందంజ

మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ కుమారి అన్నారు. కళాశాలలలో మహిళా అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


దేశాభివృద్ధిలో కీలకం

రాజమహేంద్రవరం సిటీ: కుటుంబ సంక్షమంతో పాటు దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి అన్నారు. బీజేపీ 8వ మండల అధ్యక్షుడు నందివాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో కోటిలింగాలపేటలో శానిటేషన్ నిర్వహిస్తున్న మహిళా సిబ్బంది, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలను సన్మానించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన

కంబాలచెరువు: జిల్లా ఎస్పీ కార్యాలయంలో పవన్ యాపిల్ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళల దంత సంరక్షణ, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వైద్యులు ఓరల్ స్క్రీనింగ్ నిర్వహించి, వారి దంత ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. డాక్టర్ సత్య ప్రసాద్, మా వైద్య బృందం అందరికీ దంత వైద్య సలహాలు అందించారు.

అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ నాగలక్ష్మి

రాజమహేంద్రవరం రూరల్: విధి నిర్వహణలో మహిళా ఉద్యోగినులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని, వాటిని అధిగమించేందుకు న్యాయ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ నోడల్ ఆఫీసర్ కె.నాగలక్ష్మి అన్నారు. బొమ్మూరు మహిళా ప్రాంగణంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆ శాఖ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఆస్పత్రులలో శిశువుల అమ్మకాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పిల్లల లేనివారు ఐసీడీఎస్ అధికారులను సంప్రదిస్తే పిల్లలను దత్తత ఇస్తారని తెలిపారు. లీగల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.శ్రీగౌరీ పలు చట్టాలపై అవగాహన కల్పించారు. వైద్య, ఆరోగ్య శాఖ ఓఎస్‌సీ అడ్మిన్ జె.సౌజన్య, డీపీహెచ్ఎన్‌వో జి.వసంతలక్ష్మి, వసుధ తదితరులు మాట్లాడారు.

నఖచిత్రంతో శుభాకాంక్షలు



రవి పరస గీసిన నఖచిత్రం

సీటీఆర్ఐ: ఆదిశేషునిలా తన వేయి పడగల నీడలా కాపాడేది స్త్రీమూర్తిని, అలాగే అకృత్యాలను కాలనాగులా కాటేసి ధర్మరక్షణ చేసేది కూడా జగన్మాతే అని అర్థం వచ్చేలా ప్రముఖ నఖ చిత్రకారుడు రవి పరస గీసిన చిత్రం ఆకట్టుకుంటోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నఖ చిత్రాన్ని ఆయన మహిళలకు అంకితం చేశారు.